# స్త్రీవాద కవిత్వం - స్త్రీ

డా. చామర్తి అన్నపూర్ణ
రీడర్ & తెలుగు శాఖాధ్యక్షులు
సెయింట్ జోసఫ్ మహిళాకళాశాల (అ)
విశాఖపట్నం-530 004
సెల్ - 99485 99041
drannapurnasjcw@gmail.com

ఈ ప్రపంచం అంతా పురుషుడికే అనుకూలంగావుందని చెప్పడానికి మన ఆలోచనలు ఆచరణలే ప్రమాణంగా చెప్పవచ్చు. పూర్వం మన సమాజానికి ఉపయోగించే ముఖ్యమైన మూడు పుస్తకాలు కన్పిస్తున్నాయి. అవి మనుధర్మశాస్త్రం, వాత్స్యాయనుని కామశాస్త్రం, కౌటిల్యుని అర్థశాస్త్రం పరిశీలిస్తే ఈ విషయం స్పష్టంగా బోధపడుతుంది. మను ధర్మశాస్త్రంలో స్త్రీ స్వేచ్ఛకు సంబంధించి స్పష్టంగానే చెప్పారు. బాల్యంలో తండ్రి చేత, యవ్వనంలో భర్తచేత, వృద్ధాప్యంలో పుత్రుని చేత రక్షించబడుతుంది కాబట్టి 'నస్త్రీ స్వాతంత్ర్యమర్హతి' అని స్త్రీ స్వాతంత్ర్యానికి తగదు, అర్హమైంది కాదు అని చెప్పబడింది. భార్యకి హక్కులకన్నా బాధ్యతలే ఎక్కువ. భర్తను దైవంగా కొలవాలని, భర్త చెడు మార్గంపట్టినా సహనంతో ఉండాలని, సవతుల్ని తెచ్చినా ఓర్పుపాటించాలని చెప్తూకుంటు వచ్చారు. ఆస్తిహక్కులు, విడాకుల హక్కులు లేకుండ చేశారు.

ఇక పాశ్చాత్య సమాజంలోకూడా స్త్రీల పరిస్థితి చూసినా, ప్రపంచం అంతా ఒకే విధంగా ఉన్నట్లు స్పష్టంగా బోధపడుతుంది. ఇటువంటి పరిస్థితుల్లో స్త్రీలు ద్వితీయపౌరులయ్యారు. Second Sex Second class Citizens అయ్యారు. స్త్రీలు పురుషుల నీడలయ్యారని చెప్పవచ్చు. ఇలాంటి పరిస్థితిని మార్చడానికే స్త్రీలు ముందుకువచ్చి (ఉద్యమిస్తున్నారు) ఉద్యమించారు.

ఇక ఆధునిక తెలుగుసాహిత్యంలో స్త్రీవాద కవిత్వం 1980 నుంచి ప్రారంభమైందని చెప్పవచ్చు, ఇప్పటి వరకు పురుషుడి దృష్ట్యావున్న ఈ మానవ ప్రపంచాన్ని స్త్రీలు తమ దృష్ట్యాచూడటం, మాట్లాడటం, రాయటం, చివరిగా మార్చటం స్త్రీవాదంగా చెప్పుకోవచ్చు. స్త్రీ వాదులు స్త్రీ సమస్యని సాంఘిక సమస్యగా గుర్తించటం, నేడు స్త్రీలు హక్కులకోసం, చట్టపరమైన సంస్కరణలకోసం పోరాటం, ఆందోళనలు చేస్తున్నారు. అంతేకాదు స్త్రీల అణచివేతని వ్యతిరేకించటం, విముక్తికోసం, సమానత్వం కోసం ఉద్యమిస్తున్నారు. నేటి తెలుగు కవిత్వంలో "స్త్రీ" స్వేచ్ఛను గురించి, వివాహం, లింగ వివక్షత, లైంగిక స్వేచ్ఛ, మాతృత్వం, ఇంటిపని మొదలైన విషయాలలో స్త్రీల జీవన స్థితిలోని వాస్తవికతను తెల్పుతూ కవయిత్రులు తమ కవిత్వం ద్వారా సామాజిక చైతన్యాన్ని ఏవిధంగా కల్గించారో చెప్పడమే నా పత్రం యొక్క ముఖ్య ఉద్దేశం.

**స్త్రీవాద దృక్పథాలు** - ప్రపంచవ్యాప్తంగా స్త్రీవిముక్తికోసం వుద్యమాలు ఒకేరకంగా లేవు. అందరి లక్ష్యం స్త్రీ స్వేచ్ఛ, సమానత్వాలే కాని పోరాట మార్గాల్లో భిన్న ధోరణులు కన్పిస్తున్నాయి 1) ఉదారస్త్రీవాదం 2) విప్లవాత్మక స్త్రీవాదం 3) మార్క్సిస్టు స్త్రీవాదం 4) సామ్యావాద స్త్రీవాదం 5) సాంస్కృతిక స్త్రీవాదం మొదలైనవి కన్పిస్తున్నాయి.

**స్త్రీవాద కవిత్వం** - తెలుగు కవిత్వంలో పూర్వం రాముడు, కృష్ణుడు లేదా పురాణ పురుషుల్లో ఎవరో ఒకరు కవితా వస్తువులుగా కన్పించేవారు, ఆధునిక యుగంలో స్త్రీవాద కవిత్వంలో ఓణీలూ,పైటా, వంటిల్లూ, గిన్నె, మొదలైనవి కవితా వస్తువులుగా కన్పిస్తున్నాయి, రేవతిదేవి, కొండేపూడి నిర్మల, విమల, సావిత్రి, అబ్బూరిఛాయదేవి,

హేమలత, స్త్రీల సమస్యలపై మంచి కవితల్ని రాశారు. స్త్రీవాద రచనలు చేసేవారిలో అత్యధికశాతం స్త్రీలే అయినప్పటికీ పురుషులు కూడా వున్నారు, వారిలో శ్రీశ్రీని మొదటిగా చెప్పుకోవచ్చు. స్త్రీవాద కవిత్వం ప్రధానంగా తొమ్మిది రకాలుగా మనం విభజించవచ్చు. ఇందులో మళ్ళీ అనేక అంతర్భాగాలు కూడా కన్పిస్తున్నాయి.

**స్త్రీవాదం కవిత్వంలో – స్త్రీ** – పితృస్వామ్య వ్యవస్థలో – కుటుంబంలో స్త్రీ స్థానాన్ని పురుషుడు స్వాధీనం చేసుకున్నదశ, పురుషుడే ఇంటి యజమానిగా వుంటూ, అన్నిటినీ నియంత్రిస్తూ వుండటం కన్పిస్తుంది. ఇంటి యజమాని ద్వారానే కుటుంబసభ్యులందరూ సమాజంలో గుర్తింపు పొందుతూ ఉంటారు. ఈ దశలో పురుషుడికి స్త్రీల శ్రమను, లైంగికత్వాన్ని, సంతానోత్పత్తిశక్తినీ నియంత్రించడానికి అవకాశం ఏర్పడింది. దీంతో పురుషుడికి స్త్రీమీద, ఆస్తి మీద ఆధిక్యత, అధికారం ఏర్పడ్డాయి, పితృస్వామ్య భావజాలం మూలాలు గుర్తించి వాటి నుంచి తమ అస్తిత్వాన్ని పరిరక్షించుకోవడం, కొత్త విలువలు అన్వేషించడం, అన్వేషణ సామూహిక చేతనంగా మార్చడం స్త్రీవాదకవిత్వోద్దేశంగా నేడు కన్పిస్తోంది.

ఇక కవిత్వ పరంగా చూస్తే రేవతీదేవి 'రుచించనిమాట' అనే కవితలో పితృస్వామ్య అస్థిత్వాన్ని గురించి ఇలా అన్నారు.

మగకీ ఆడకీ
శీలాన్నీ, ఆస్తినీ
సమంగా వర్తింపించండి

అంటూ రాసిన ఈ కవితలో తనభావాల్ని ఆలోచనల్ని నిర్మొహమాటంగా, నిర్భయంగా కవయిత్రి వ్యక్తీకరించారు. తాము చెప్పాలనుకున్నదాన్ని చెప్పడానికి వీలులేకుండా ఈ సమాజం చేసిందని రచయిత్రి బాధపడుతారు. రేవతీదేవి రాసిన కవితలు చిన్నవే అయినా అందులోమంచి భావాన్ని వ్యక్తీకరించారు. పితృస్వామ్య వ్యవస్థలో స్త్రీకి మాత్రమే 'శీలం' పరిమితం చేయబడింది. పురుషులకు శీలంతో పనిలేదు. ఒకరికంటే ఎక్కువ మందితో లైంగిక సంబంధం ఉంటే స్త్రీకి శీలం లేదంటారు. పురుషుడు ఎక్కువమందితో సంబంధం పెట్టుకుంటే చెడిపోయినవాడని ఈ సమాజం అంటంలేదు. అంతేకాక రసికుడని, శృంగార రసజ్ఞుడని అంటారు. స్త్రీలకోక న్యాయం,పురుషులకో న్యాయం ఈ ద్వంద్వ స్థితిని రేవతీదేవి పై కవితలో నిరసిస్తారు.

వసంతకన్నభిరామన్ 'శరీరం' కవితలో పితృస్వామ్యమూలాన్ని అన్వేషించి తన కవితలో "పురాతన పితృస్వామ్య వివాదాలకు బలిగా నిల్చింది నా శరీరమే" అని చెప్పారు. అబ్బూరి ఛాయాదేవిగారు 'విన్నావా' అనే కవితలో స్త్రీపట్ల సమాజం ఏవిధంగా ప్రవర్తిస్తోందో తెల్పుతూ, సమాజం స్త్రీని అనుక్షణం "నువ్వు ఆడదానివి, గీత దాటకూడని దానివి, మచ్చపడితే మాయని దానివి" అంటుందంటారు. ఈ మచ్చులు, గీతలు స్త్రీలకే గాని పురుషులకు లేవంటుంది ఈ సమాజం.

1. **వివాహం:** పితృస్వామ్యంలో పురుషాధిపత్యాన్ని సావిత్రి "బందిపోట్లు" కవితలో కుప్పలుపోసినట్లు చూపించారు.

"పెళ్ళంటే పెద్ద శిక్షని
మొగుడంటే స్వేచ్ఛాభక్షకుడని
మేం పాలిచ్చి పెంచిన జనంలో సగమే
మమల్ని విభజించి పాలిస్తోందని"

పెళ్ళి అనేది స్త్రీ జీవితంలో తప్పనిసరి అయితే, పెళ్ళివల్ల స్త్రీకి ఒరిగేదేమి లేదని, తనని హింసించేందుకు పురుషుడికి లైసెన్స్ ఇవ్వటమేనని రచయిత్రి అభిప్రాయం.

2) **లైంగిక వివక్ష:** రజియాబేగం నేటి స్త్రీ విభిన్నదశలలో అనుభవించే బాధలకు అద్దంపడుతూ రాసిన కవిత ఇది.

"బాల్యంలో
చిన్నపిల్లవి నీకేం తెల్సుకూర్చోఅన్నారు.
యవ్వనంలో
ఉడుకు రక్తం మంచీ చెడు తెలీదు కూర్చోఅన్నారు
వృద్ధాప్యంలో
ముసల్దానివి ఇంకేం చేస్తావుకూర్చో అన్నారు.
అవకాశం రానందుకు కోపంగా లేదు నాకు
కూర్చొని కూర్చొని బద్ధకం వచ్చినందుకు బాధగా ఉంది."

అని లింగ వివక్షతను తెల్పు ఈ కవితలో ఏ దశలోను స్త్రీకి స్వేచ్ఛ లేకుండా చేసి అణిచి ఉంచారనే విషయం స్పష్టంగా కన్పిస్తోంది. అంతేకాదు స్త్రీ పుట్టుక నుంచి వృద్ధాప్యం వరకు పడే బాధలు వున్నవి వున్నట్లు కవయిత్రి వర్ణించారు.

3) **మాతృత్వం:** పిల్లలకి జన్మనివ్వటంతోపాటు వారి పోషణ, శిక్షణ అన్నీ మాతృత్వంలో భాగంగా గుర్తింపు పొందాయి. మానవ ఉత్పత్తి లేకపోతే వస్తూత్పత్తి లేదు. దీనికి కారణం స్త్రీ పునరుత్పత్తి శక్తే కాబట్టి, మాతృత్వాన్ని కూడ రాజకీయ, ఆర్థిక అంశంగా స్త్రీవాదులు గుర్తించాలంటారు. పిల్లల పెంపకంలో సమాన భాగస్వామ్యం వుండాలని కోరతారు. పిల్లల విషయంలో నిర్ణయించుకునే హక్కు స్త్రీకే వుండాలని చెబుతారు.

ఈ మాతృత్వ భావన జయప్రభ కవిత 'ఆడతనంతో అచంచల విశ్వాసంతో' అనే దానిలో ఉన్నతంగా ఉంది.

"నా పురిటి నొప్పులు కదా
కొత్త సృష్టికి కారణం"
"నా ఆడతనమే
నాకీ రూపాన్నిచ్చింది,
రక్తస్రావాన్నిచ్చింది,
నన్ను తల్లిని చేసింది
గర్వంతో తలెత్తుకునేలాచేసింది"

మాతృత్వంలో ప్రసవవేదన ఎంతతీవ్రంగా, భరింపరానిదిగా ఉంటుందో కొండేపూడి "లేబర్ రూమ్" కవితలో బలంగా ప్రకటించారు, ఆ కవితను పరిశీలిస్తే –

"తల క్రిందులుగా వేలాడదీసిన సెలైన్‌బాటిల్లా
నిండునెల్లగర్భిణి
ఒక్కో బొట్టు చొప్పున మొత్తం ప్రాణం ఇచ్చుకోవడానికి వస్తోంది.

అడ్డు తప్పుకోండి, అడ్డుతప్పుకోండి".

విమలగారు స్త్రీలనుద్దేశించి "ఓ పునరుత్పత్తి పరికరమా" అనే సంబోధించారు.

4) **ఇంటిపని:** ఇంటిపనికి సరైన గుర్తింపు, విలువవుండాలని స్త్రీవాదులు కోరుతున్నారు. స్త్రీని వంటింటికే పరిమితం చెయ్యటంవల్ల వ్యక్తిత్వ వికాసం జరగటంలేదని గుర్తించారు. ఆర్థిక స్వేచ్ఛలేదని తెలుసుకున్నారు. అందుకని తమ శ్రమకి విలువ వుండాలని, తమ శ్రమలో పురుషుని భాగస్వామ్యం వుండాలని స్త్రీవాదులు అడుగుతున్నారు. పాటిబండ్ల రజని "ఉద్యోగిని ఆదివారం' కవితలో ఈ విషయాన్నే స్పష్టంగా ప్రకటించారు.

"అన్ని బాధ్యతల్నీ సమానంగా పంచుకునే మనం
మన బరువు దించేందుకు చేయందించరేమని నిలదీయాలి!
మన పిల్లల నుంచైనా
ఇంటి పనంటే ఇంతులది కాదని నేర్పాలి!
అమ్మాయిలతో పాటు అబ్బాయికీ
అంట్లు తోమటం అలవాటు చేయాలి"

ఇదే విషయం మీద విమల గారు రాసిన 'వంటిల్లు' చాల బలమైన కవిత. అసలు పురుషాధిక్యతకు ఒక కేంద్ర బిందువు వంటిల్లు. స్త్రీల విషాదానికి పుట్టిల్లు వంటిల్లు. ఈ వంటిల్లు విశ్వరూపాన్ని విమల ఈ క్రింది విధంగా అద్భుతంగా ఆవిష్కరించారు.

"మా అమ్మ మా అమ్మమ్మ
ఇంట్లో అమ్మలంతా ఇక్కడ స్త్రీలయ్యారట
భయం భయంగా నిశ్శబ్దంగా, నిరాశగా
మా అమ్మొక ప్రేతంలా తేలుతూ వుంటుందిక్కడ
అసలు మా అమ్మే నడుస్తున్న వంటగదిలా వుంటుంది.
ఈ వంటింటి సామ్రాజ్యానికి మా అమ్మేరాణి
అయినా చివరకు వంటింటి గిన్నెలన్నింటిపైనా
మా నాన్న పేరే."

**5. శారీరకస్పృహ:** 'సౌందర్యాత్మక హింస' అనే కవితలో విమల స్త్రీ శరీరాన్ని భోగవస్తువుగా తీర్చిదిద్దడాన్ని ఈ క్రింది కవితలో

"అందం పోటీయైనచోట
అందం సరుకైనచోట
అందాల వ్యాపారాన్ని ద్వేషిద్దాం"

అంటూ చెప్పిన ఈ కవితలో, పితృస్వామ్యంలోని వ్యాపార దృక్పథాన్ని విడమరచి చెప్పారు.

**6. లైంగికస్వేచ్ఛ:** స్త్రీ మీద లైంగిన హింస నిరంతరం జరుగుతూనే ఉంది. దీన్ని కుటుంబంలోపల వ్యవహారంగా తీసుకున్నంత కాలం సమస్యగా ఎవరు గుర్తించలేదు. దీన్ని సామాజిక సమస్యగా,స్త్రీ వ్యక్తిత్వం మీద జరిగే దాడిగా పరిగణించారు. స్త్రీ శరీరం మీద స్త్రీకే అధికారం ఉందని స్త్రీ వాదులు ప్రతిపాదించారు. వసంతకన్న భిరాన్

'శరీరం' కవితలో లైంగికహింస వికృత రూపం ఈ విధంగా కన్పిస్తుంది.

"ఇక ఈ గర్భకుహరమా
దాని సంగతే నేనుమరిచాను
అదొకటుందని కూడ గుర్తులేదు
నీ అసహజ హింసా లోభ వాంఛలకు
ఆధారాలుగా ఆహ్వానాలుగా
నీవు మలుచుకున్న ఈ పాలిండ్లు
వాటి అర్థాన్నే కోల్పోయి శూన్యమయ్యాయి."

ఇలా రేవతిదేవి నుంచి రజని వరకూ స్త్రీల శారీరక, మానసిక ప్రపంచాల మీద పురుష ప్రపంచం చేస్తున్నక్రూరమైన హింసల్నీ, అల్లిన మాయాజాలాన్నీ ఒక్కొక్క కవితావస్తువుగా చేసుకొని కవిత్వంరాశారు. తెలుగు సాహిత్యంలోకి ఇంతకు ముందులేని కొత్త కవితా వస్తువుని, కొత్త ఆలోచనల్ని, అనుభవాల్ని, అనుభూతుల్ని, వ్యక్తీకరణల్ని తమ కవిత్వంలో చేర్చుకుంటువచ్చారు. ఇప్పటిదాక తమదికాని తమ శరీరం మీదా, మనసు మీద తమహక్కు ప్రకటించడమేకాదు. తమ చరిత్రను, సాహిత్యాన్ని తామే సృష్టించు కోడానికి స్త్రీలు గొంతువిప్పారు. సమాజంలోను, సాహిత్యంలోను పురుషులతో సమానంగా స్త్రీలు తామే స్థానాన్ని కేటాయించుకున్నారు.

ఈ విధంగా తమ కవిత్వం ద్వారా పురుషాధిక్య వ్యవస్థపై తిరుగుబాటు చేసిన జయప్రభగారి 'పైటను తగలెయ్యాలి' అనే కవిత తిరుగుబాటుకుమంచి శక్తినిచ్చింది, అలాగే "కుక్కర్ విజిల్స్‌లోనే, మనోజ్ఞ సంగీతం వింటాను... బహుపాత్రాభినయం పోటీలో నా చేతులకెప్పుడూ ఫస్ట్‌ప్రైజే" అనేక కవితలోను, పెళ్ళి తరువాత స్త్రీ ఎన్ని అవతారాలు ఎత్తుతుందో తెల్పే హైమవతిగారి కవిత, పితృస్వామ్య వ్యవస్థలో స్త్రీగా పుట్టడమే పెద్దపాపంలా, శాపంలా భావించి, తమ ఉనికే నిబద్ధం అని చెప్పిన శ్రీమతిగారి కవితలు నేటి స్త్రీల జీవన స్థితిని, వాస్తవికతను తెల్పుతూ సామాజిక చైతన్యాన్ని కల్గిస్తున్నాయి.

**ఆధార గ్రంథాలు :**


1. భావ కవిత్వంలో స్త్రీ – డా॥ జయప్రభ.
2. భారతీయ సంస్కృతిలో స్త్రీ – డా॥ కత్తి పద్మారావు.
3. సంప్రదాయ సాహిత్యం – స్త్రీవాద దృక్పథం – ఆచార్య క్యాయనీ విద్మహే.
4. స్త్రీ వాద ధోరణులు – సమకాలీన సాహిత్యం – యువభారతి.